# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 25 అక్టోబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 117

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




ఫస్ట్ లుక్‌లోనే ఫిదా.. సోనియా--రాజీవ్ లవ్ స్టోరీ!




## రక్షణ పెట్టుబడులు

# రెండింతలు చేయండి

### ప్రభుత్వం నుంచి ఏం కావాలన్నా ఇస్తా

### రక్షణ రంగంలో భారత్‌ను సూపర్‌పవర్‌గా నిలుపుదాం

### అతిపెద్ద భాగస్వామిగా తెలంగాణను తీర్చిదిద్దుదాం

**త్వరలో రక్షణ, ఏరోస్పేస్ 2.0 పాలసీ విడుదల**

**జీడీపీలో తెలంగాణ వాటా డబుల్ కావాలి**

**అందుకు రక్షణ పెట్టుబడులే కీలకం**

**'రక్ష ఎక్స్‌పో 2026' లో సీఎం రేవంత్‌రెడ్డి**

ఆయుధ ఎగుమతులు, రక్షణ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా చూడాలనేది తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా మారాలని చెప్పారు. యుద్ధానికి అవసరమైన సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయి దేశం ఎదగాలన్నారు. శనివారం రాత్రి తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన 'రక్ష ఎక్స్‌పో-2026' ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం కీలకోపన్యాసం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రక్షణ పెట్టుబడుల కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, కార్మిక మంత్రి జి.వివేక్, మాజీ ఎయిర్‌చీఫ్ మార్షల్ వివేక్ రామ్‌చౌదరి, 90 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

హైదరాబాద్, అక్టోబరు 24 : రక్షణ రంగంలో భారత్ సూపర్‌పవర్‌గా ఎదగాలని.. ఆ దిశగా తెలంగాణ అతిపెద్ద భాగస్వామిగా ఉండాలనేదే తన అభిమతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకు పారిశ్రామికవేత్తల సహకారం అవసరమన్నారు. రాష్ట్రానికి త్వరలోనే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0ను విడుదల చేయబోతున్నామని, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా అది ఉ ంటుందని పేర్కొన్నారు. భారత ఫ్యూచర్‌సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌లో భాగంగా 'రక్ష ఎక్స్‌పో 2026' నిర్వహించను న్నారు. దానికి సన్నాహకంగా 'రక్ష ఎక్స్‌పో 2026 కర్టన్‌రైజ్'ను హైదరాబాద్ తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో శనివారం సీఎం ప్రారంభించి లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్ష, అంతర్గత భద్రత రంగాలకు చెందిన 90 మందికిపైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీల ముఖ్య ప్రతినిధులు సీనియర్ సైనికాధికారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విదేశీ కాన్సులేట్‌ల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'భారత ఫ్యూచర్‌సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ విజయవంతానికి పారిశ్రామిక వేత్తలు

మిగతా 2 లో

# పనిచేసే వారికే పదవులుంటాయి



### క్షేత్రస్థాయిలో పనిచేయకుంటే పోస్టులెందుకు?

**పదవులను వేరే వాళ్లకు ఇచ్చేయండి**

**కాంగ్రెస్ కుట్రలను గట్టిగా తిప్పికొట్టండి**

**బీజేపీ నేతలకు సునీల్ బన్సల్ వార్నింగ్**

క్షేత్రస్థాయిలోకి వెళ్లి పనిచేయని వారికి పోస్టులెందుకని బీజేపీ నాయకులపై ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. మీ వల్ల కాకపోతే మీ పదవులను వేరే వాళ్లకు ఇవ్వొచ్చు కదా అని ఆయన ఘాటుగా చెప్పినట్లు తెలిసింది. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికలకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసేందుకు శనివారం ఒక హోటల్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో, ఆ తరువాత పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో బన్సల్ స్థాయిలో మాస్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

హైదరాబాద్, అక్టోబరు 24 : తెలంగాణ అంటే ఒక్క హైదరాబాద్ కాదని, రాష్ట్ర కార్యాలయం చుట్టూరా తిరిగితే వచ్చేదేమీ లేదని చెప్పారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఇక్కడ నాయకుల చుట్టూ తిరిగితే పార్టీ ఎలా ఎదుగుతుందని మండిపడ్డారు. నాయకులు బహిరంగ సభల్లో మాట్లాడే దానికంటే క్షేత్రస్థాయి-ంలో చిన్న సమూహాలతో కలిసి, వారితో మమేకమై మాట్లాడితే ఆ ప్రభావం వేరుగా ఉంటుందని హితబోధ చేశారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన కార్యక్రమాలను సక్రమంగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని, రాబోయే ప్రతీ ఎన్నిక కీలకమేనని

మిగతా 2 లో

## కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్




**అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు**

**కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష**

**నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం**

**కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన**

**అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి**

# ఎల్‌నినో ఎఫెక్ట్.. పసిఫిక్‌లో హీట్ రికార్డ్!



- 30 °Cకు చేరిన సముద్రం. ప్రపంచానికి వెదర్ టెన్షన్!
- భారత్‌లో వానలు తక్కువా? ఎండలు ఎక్కువా?

**వాతావరణంలో కొత్త కలకలం!**

వెదర్ స్పెషల్, అక్టోబర్ 24

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో హీట్ పెంచుదోందా..? అక్టోబర్ 22న భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సుమారు 30డిగ్రీజకు చేరినట్లు వచ్చిన నివేదికలు వాతావరణంపై చర్చకు దారితీశాయి. ఎల్‌నినో బలపడితే ప్రపంచవ్యాప్తంగా వానలు, ఎండల లెక్కలు తారుమారయ్యే ఛాన్స్ ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎల్‌నినో అంటే ఏంది గురూ?

పసిఫిక్ సముద్ర జలాలు సాధారణం కంటే వేడెక్కుతాయి.కొన్ని ప్రాంతాల్లో కరువు.. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదల ముప్పు ఉండొచ్చు. డిసెంబర్‌పై గురి: ఎల్‌నినో ప్రభావం మరింత బలపడుతుందా అన్నది వాతావరణ అంచనాలపై ఆధారపడి ఉంటుంది.

భారత్‌కు ఎలాంటి ఎఫెక్ట్?

ఎల్‌నినో భారత రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు ఏర్పడొచ్చు. అయితే ప్రతి ఎల్‌నినోతోనూ ఒకే రకమైన ప్రభావం ఉంటుందని చెప్పలేం. మొత్తానికి.. పసిఫిక్‌లో హీట్ పెరిగితే ప్రపంచం మొత్తం వెదర్ టెన్షన్‌లో పడే పరిస్థితి! ఎల్‌నినో ఎంత బలపడుతుంది? భారత్‌లో వానలు, ఎండలపై ఎంత ప్రభావం చూపుతుంది? అధికారిక వాతావరణ అప్‌డేట్స్‌పై నజర్ పెట్టాల్సిందే!



## బీఆర్ఎస్ పాలనలో ఐటీ రంగం వృద్ధి

**రాండమ్ ట్రీస్ సంస్థ కార్యాలయం ప్రారంభోత్సవంలో కేటీఆర్**

**ఏఐని కొత్త అవకాశాలు సృష్టించే టెక్నాలజీగా చూడాలని సూచన**

హైదరాబాద్, అక్టోబరు 24 : బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఐటీ రంగం గణనీయ వృద్ధి సాధించిందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నానక్‌రాంగూడ వంశీరామ్ సువర్ణ దుర్గా టెక్ పార్కు ఐటీ భవనంలో

మిగతా 2 లో



## కన్నెపల్లి నుంచి నీళ్లివ్వాలి

**లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల డిమాండ్**

**సమస్య పరిష్కరించకపోతే సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని వెల్లడి**

**జయశంకర్ భూపాలపల్లి, అక్టోబరు 24 :** హైదరాబాద్‌లో తాగునీటి సంక్షోభాన్ని నివారించేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే ప్రాణహిత జలాలను ఎత్తిపోయాలని, లేనిపక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్

-మిగతా 2 లో..

## తుమ్మిడిహెట్టిపై ఫైట్ కు ముంబయిలో ముహూర్తం ఫిక్స్!

**152 మీటర్ల ఎత్తుపై తెలంగాణ పట్టుబట్టు..ఫడణవీస్‌తో రేవంత్ భేటీ!**

**,హైదరాబాద్, అక్టోబర్ 24**



:తుమ్మిడిహట్టి బ్యారేజీ పంచాయితీకి సోమవారం ముంబయిలో చర్చల షురూ కానున్నయ్.. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ కానున్నారు. బ్యారేజీ ఎత్తు 148 మీటర్లా.. 152 మీటర్లా? అన్నదానిపై తెలంగాణ తన వాదన వినిపించనుంది. నీటి లభ్యత, ముంపు, ప్రాజెక్టు రూట్ డిజైన్లపై అధికారులు పూర్తి వివరాలతో సిద్ధమవుతున్నారు. మరోవైపు సోమవారం జరగాల్సిన కేఆర్ఎంబీ మీటింగ్ తెలంగాణ విజ్ఞప్తితో మంగళవారానికి పోస్ట్‌పోన్ అయింది.

## హైదరాబాద్‌కు వాటర్ టెన్షన్ షురూ!

**ఎల్‌నినో ఎఫెక్ట్.. రిజర్వాయర్లలో నీళ్లు లో-లెవల్! కార్లు కడిగితే నహీ.. నీళ్లు బచావో భాయ్!**

**హైదరాబాద్, అక్టోబర్ 24:**



సిటీలో నీటి సంక్షోభం గుబులు పుట్టిస్తోంది.. తక్కువ వర్షాలు, పడిపోతున్న భూగర్భ జలాలతో వాటర్ కష్టాలు పెరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. మణికొండ పంచవటి సాయి లక్ష్మి కాలనీలో సైకిల్‌పై లౌడ్‌స్పీకర్‌తో నీటి పొదుపుపై ప్రచారం చేస్తున్న వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.రాష్ట్రంలో సాధారణం కంటే 27% తక్కువ వర్షపాతం నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి.621 మండలాల్లో 324 చోట్ల భూగర్భ జలాలు పడిపోయినట్లు సమాచారం.తాగునీటికి ఫస్ట్ ప్రయారిటీ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కార్లు, సెల్లార్లు, టెర్రస్‌లు కడిగేందుకు నీటిని వృథా చేయొద్దని పిలుపు నిస్తుర్రు.

## బ్యారేజ్‌లను మళ్లీ హరీశ్‌కు అప్పగించాలా?

**కాళేశ్వరం వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ దుష్ప్రచారం**

**కేసీఆర్ హయాంలోనే బ్యారేజీల్లో లోపాలు బయటపడ్డాయి**

**నీటిపారుదల శాఖ మంత్రి**



హైదరాబాద్, అక్టోబరు 24 : కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లను తనకు అప్పగిస్తే 6 నెలల్లో పునరుద్ధరించి ఇస్తానని చెప్పడానికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు సిగ్గుండాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు.

-2వ పేజీలో

వేగుచుక్క



## పనిచేసే వారికే పదవులుంటాయి

(మొదటిపేజీ తరువాయి)

సునీల్ బన్సల్ చెప్పారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయకుండా ఆశలు పెంచుకోవడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు పార్టీ పదవులకు రాజీనామా చేసి, వారి వారి నియోజకవర్గాల్లో పనిచేసుకోవాలని చెప్పారు. ఇకపై తాను రాష్ట్రంలోనే ఉండి పూర్తిస్థాయి సమయం కేటాయించనున్నట్లు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వేదికను ఇప్పటి నుంచే తయారు చేసే ప్రక్రియలో భాగంగానే బన్సల్ కాస్త కఠినంగానే మాట్లాడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయాలనుకున్న వారిలో ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన పేర్లను అధిష్టానానికి పంపించనున్నారు. ఈ నెలాఖరు నాటికి బీజేపీ జాతీయ నాయకత్వం ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పోకడలను తిప్పికొడుతూ క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. నవంబర్ 1 నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చేసే పాదయాత్రతోపాటు, మరో ఐదు చోట్ల ఈ కార్యక్రమాలు నిర్వహించాలని అధిష్టానం సూచించింది. కరీంనగర్, సిద్దిపేటలో ఈ కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. కాగా, హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో మహా పాదయాత్రలు చేస్తామని, పాదయాత్రల తేదీలు, వేదికలు త్వరలో ఖరారు చేస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు చెప్పారు. నీటి సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రజా ఉద్యమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జీలు అభయ్ పాటిల్, రేఖా శర్మ, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులు మధుకర్, దశరథ్‌తోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పాలనలో ఐటీ రంగం వృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఏఐ, డేటా, ఆవిష్కరణల సంస్థ రాండమ్ ట్రీస్.. భారత ప్రధాన కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భారాస ప్రభుత్వ హయాంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీ), సాంకేతికత సంస్థలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చాం. ఏఐ విషయంలో భయాందోళనలు అనవసరం. మార్పులను అడ్డుకోవడం కంటే వాటికి అనుగుణంగా పరివర్తన చెందడమే అభివృద్ధికి సోపానం. రాండమ్ ట్రీస్ వంటి సంస్థలు నగరంలో తమ కార్యకలాపాలను విస్తరించడం.. నగర సాంకేతిక సామర్థ్యాలను, ఉపాధి అవకాశాలను బలోపేతం చేస్తుంది' అని చెప్పారు. సంస్థ సీఈవో ప్రవీణ్ కోలా మాట్లాడుతూ.. 2017లో 17 మందితో ప్రారంభమైన తమ సంస్థ నేడు 750 మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. మరో ఏడాదిన్నరలో ఈ సంఖ్యను 7,500 చేర్చడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జయప్రకాశ్, మోహన్, సుబ్బా తదితరులు పాల్గొన్నారు.



## కన్నెపల్లి నుంచి నీళ్లివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లిలోని లక్ష్మీ పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందగౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సందర్శించారు. అనంతరం కన్నెపల్లి పంపుహౌస్ గేటు వద్ద లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నీళ్లు ఎత్తిపోయకుంటే సీఎం రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. గేటు వద్ద ఇరిగేషన్ ఈఈ సురేశ్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. జూన్ నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు సముద్రంలో కలిశాయన్నారు. కనీసం 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసినా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు పెరిగేవని, భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతోపాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీరేవని ఎమ్మెల్యేలు చెప్పారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ జూలైలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి వెళ్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్‌లో తలెత్తే నీటి సమస్యలపై అప్పుడే హెచ్చరించినట్లు తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజలే సీఎంకు బెల్టు ట్రీట్‌మెంట్‌తో తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్‌కు ఏడాదికి తాగునీరు అందించేందుకు 10 టీఎంసీల నీరు సరిపోతుందని, కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా కనీసం ఇప్పటికైనా గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మూడు రోజులకు ఒకసారి తక్కువ పీడనంతో నీరు సరఫరా అవుతోందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ముందస్తుగా జలాశయాల్లో తగినంత నీటిని నిల్వ చేసుకుని ఉంటే హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రస్తుత పరిస్థితిని నివారించగలిగే వారన్నారు. ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారంతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు.

# రక్షణ పెట్టుబడులు రెండింతలు చేయండి

(మొదటిపేజీ తరువాయి)




కృషిచేయాలని పిలుపునిచ్చారు. రక్షణ రంగానికి చెందిన భాగస్వాములందరితో ఒకే వేదికపై చర్చించే అంతర్జాతీయ వేదికగా రక్ష ఎక్స్‌పోను తీర్చిదిద్దాలన్నదే తన ఆలోచన అని తెలిపారు. "డీఆర్‌డీవో, హెచ్‌ఏఎల్, బీడీఎల్, మిథాని, టాటా, లాక్‌హీడ్ మార్టిన్, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్ వంటి కంపెనీలతో రక్షణ రంగంలో మనం ఛాంపియన్లుగా ఉన్నాం. దేశంలోనే హైదరాబాద్ వ్యూహాత్మకంగా కీలకమైన స్థానంలో ఉంది. హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరమే కాదు.. అనేక కీలక పరిశోధన సంస్థలకు నిలయంగా ఉంది. భారత సైన్యం, వైమానిక దళాలకు సంబంధించిన అనేక ముఖ్యమైన వ్యూహాత్మక కేంద్రాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో సముద్ర తీరం లేని ఏకైక రాష్ట్రమైన తెలంగాణ భారత నౌకదళానికి కీలక సేవలందిస్తోంది. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో నౌకాదళ రాడార్ కేంద్రం నిర్మాణంలో ఉంది. ఈ రంగానికి అత్యంత ప్రతిభావంతులైన యువత అవసరం ఉంది. ఆ దిశగా యువతను తీర్చిదిద్దేందుకు ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ, ఎన్ఐటీ, ఐఎస్‌బీ, బిట్స్ వంటి ఉత్తమ విద్యాసంస్థలు రాష్ట్రంలో ఉన్నాయి. నైపుణ్యాలున్న మానవ వనరుల్ని తయారు చేసేందుకు యంగ్‌ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని హైదరాబాద్‌లో నిర్మిస్తున్నాం. ఇప్పటికే విజయవంతంగా పనిచేస్తున్న ఇంక్యుబేటర్లు ఇక్కడ ఉన్నాయి' అని సీఎం అన్నారు. 'యుద్ధం కోసమే కాకుండా..శాంతిని కాపాడేందుకూ ఆయుధాలు అవసరం. శత్రువులు యుద్ధానికి దిగకుండా నిరోధించే శక్తి కూడా వ్యూహాత్మక ఆధిక్యాన్ని అందిస్తుంది. రక్షణ రంగంతోపాటు స్పేస్, ఏరోస్పేస్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ, డ్రోన్ టెక్నాలజీ వంటి అనేక అనుబంధ రంగాల్లో ఉన్న పారిశ్రామిక వేత్తలు ఈ లక్ష్యాన్ని సాకారం చేయాలని ఆకాంక్షిస్తున్నా. తెలంగాణ అభివృద్ధిపై నాకో స్పష్టమైన దార్శనికత ఉంది. దేశ జనాభాలో ప్రస్తుతం రాష్ట్ర వాటా సుమారు 2.5 శాతం. జీడీపీలో తెలంగాణ 5 శాతాన్ని అందిస్తోంది. 2047 నాటికి ఆ వాటాను 10 శాతం సాధించాలన్నదే నా లక్ష్యం. ఈ దార్శనికతను సాకారం చేయడంలో రక్షణ ఉత్పత్తుల తయారీ, ఏరోస్పేస్, వాటి అనుబంధ రంగాలే కీలకం' అని సీఎం అన్నారు. 'తెలంగాణలో పెట్టుబడులు పెట్టే దిశగా రూపొందించుకున్న ప్రణాళికలను రెట్టింపు చేయాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నా. మీ లక్ష్యాన్ని సాధించేందుకు మా నుంచి ఎలాంటి సహకారం కావాలో చెబితే సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం. అవసరమైతే ప్రతీ పెట్టుబడిదారుడితో నేనే స్వయంగా మాట్లాడతా. ప్రస్తుతం ఇక్కడున్న మీ కంపెనీల్లో పెట్టుబడులను రెట్టింపు చేస్తే.. మీ లాభాలను రెట్టింపు చేసే పూచీ మాది. రక్షణ రంగంలో దేశాన్ని సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి పనిచేద్దాం' అని సీఎం పిలుపునిచ్చారు. 2023-24లో తెలంగాణ నుంచి ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో రూ.15,900 కోట్లుగా ఉన్న ఎగుమతులు ప్రస్తుతం రూ.32,850 కోట్లకు చేరాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, ఎయిర్‌బస్, సాఫ్రాన్ వంటి అంతర్జాతీయ సంస్థలతోపాటు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, బీడీఎల్, పలు ప్రత్యేక విడిభాగాల తయారీ సంస్థలు హైదరాబాద్ పారిశ్రామిక బలానికి నిదర్శనమన్నారు. ఆదిభట్లలో టాటా-బోయింగ్ భాగస్వామ్యంతో అపాచీ హెలికాప్టర్ల ప్రధాన బాడీ నిర్మాణ భాగాలను తయారు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. పన్నెండేళ్ల క్రితమే తమ కంపెనీని హైదరాబాద్‌లో ప్రారంభించామని, రాబోయే రోజుల్లో మరింత భారీ పెట్టుబడులు పెట్టే దిశగా ఆలోచన చేస్తున్నట్లు ప్రముఖ వ్యాపారవేత్త బాబా కల్యాణి తెలిపారు. 2018లో తమ కంపెనీ ప్రారంభించాలనుకున్నప్పుడు హైదరాబాద్, బెంగళూరుల్లో తమకు అవకాశం ఉండేదని, తాము మాత్రం హైదరాబాద్‌ను ఎంచుకున్నామని స్కైరూట్ సీఈవో పవన్‌కుమార్ చందన పేర్కొన్నారు. దేశంలోనే పెట్టుబడులకు సురక్షిత రాష్ట్రంగా, సుస్థిర ప్రభుత్వం కలిగిన తెలంగాణలో తమ కంపెనీ పెట్టుబడులను ఏటా పెంచుకుంటూ వెళ్తామని తెలిపారు. తెలంగాణను రాకెట్ సిటీగా అభివర్ణించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎయిర్‌చీఫ్ మార్షల్ చౌదరి, డీఆర్‌డీవో పూర్వ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి, సీఎస్ సంజయ్‌జాజు, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖాగోయల్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యారేజ్ లను మళ్లీ హరీశ్‌కు అప్పగించాలా?




(మొదటిపేజీ తరువాయి)

ఆయన ఆ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కట్టిన మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ మళ్లీ బరాజ్‌లను ఆయనకే అప్పగించాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తప్పిదాలు, అవినీతితోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ. లక్ష కోట్లు ఖర్చయిందని.. మళ్లీ వారి వల్లే బరాజ్‌ల పునరుద్ధరణకు మరో రూ. 2--3 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని తప్పుబట్టారు. మంత్రి గడ్డం వివేక్‌తో కలిసి శనివారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో బయటపడిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే భారాస నాయకులు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల భారాస పాలనలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్సెల్బీసీ, సీతారామ తదితర ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే ప్రస్తుత కరవు పరిస్థితులను ఎదుర్కొనే పరిస్థితి ఉండేది కాదా అని ప్రశ్నించారు. ఎల్‌నినో పరిస్థితులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకు భారాస నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 'వారి పాలనలో ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతలను పూర్తిచేసి ఉంటే 16 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవి. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని నాడు కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారు. రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాక తుమ్మిడిహెట్టి నుంచి ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చారు. స్వార్థంతో కమీషన్ల కోసం రూ.80 వేల కోట్లకు అంచనాలు పెంచారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం డీపీఆర్‌లో ఒకటి చెప్పి..దాన్ని మార్చి సీకెంట్ పైల్స్‌తో పునాదిని నిర్మించింది. సొంత డిజైన్లు, నాణ్యత లోపాలతో వారి పాలనలోనే మేడిగడ్డ కుంగింది' అని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాలను అత్యధికంగా, సమర్థంగా వినియోగించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. కాళేశ్వరం బ్యారేజీలు లేకున్నా రికార్డు స్థాయిలో వరి సాగు, దిగుబడి సాధించాం. బ్యారేజీల పునరుద్ధరణపై అంతర్జాతీయ నిపుణుల సలహాలతో ముందుకు వెళ్తున్నాం' అని ఉత్తమ్ పేర్కొన్నారు. మూడు బ్యారేజీల్లో లోపాలపై పరిశోధన చేస్తున్న సంస్థలు గుర్తించాయని, పునరుద్ధరణ డిజైన్లు కూడా సిద్ధమయ్యాయని నీటిపారుదల సలహాదారు పరీక్షిత్ మెహ్రా పేర్కొన్నారు. కాళేశ్వరం పునరుద్ధరణ పనులపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డిజైన్లపై తుది ఆమోదం రావాల్సి ఉందని, డిసెంబరు నాటికి పనులు ప్రారంభించి, వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. 2023 అక్టోబరులో నాటి భారాస ప్రభుత్వ హయాంలోనే బ్యారేజీలలో నాణ్యత లోపాలు బయటపడ్డాయని ఉత్తమ్ తెలిపారు. 'వారి ప్రభుత్వం ఉన్నప్పుడే నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) బృందం బ్యారేజీలను సందర్శించింది. బ్యారేజీల్లో ఘోర వైఫల్యాలు ఉన్నాయని తేల్చింది. అన్నారం, సుందిళ్ల గేట్లు తెరిచే ఉంచాలని, నీటిని నిల్వచేస్తే ప్రమాదమని కూడా హెచ్చరించింది. మూడు బ్యారేజీల పునాదులు ఒకే తరహాలో కట్టారని, వాటిలో లోపాలు ఉన్నాయని, అవి ఎప్పుడైనా కూలొచ్చని ఎన్డీఎస్ఏ లిఖితపూర్వకంగా రాసిచ్చింది. అన్నీ తెలిసి కూడా కన్నెపల్లి పంపులు నడిపి అన్నారం, సుందిళ్ల నింపాలని భారాస నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అదెలా సాధ్యం. పంపుహౌస్‌లకు నీళ్లు అందాలంటే గేట్లు దింపాలి కదా. హరీశ్‌రావు నీటిపారుదలశాఖ మంత్రిగా సరిగా పనిచేయలేదనే కారణంతోనే ఆయన్ను కేసీఆర్ తొలగించారు. ఇప్పుడేమో పంపులు నడిపించి చూపుతానంటూ సవాళ్లు విసురుతున్నారు. జరిగిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తెలంగాణ రైతాంగాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

## యువత తమ ఆలోచనలకు పదును పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)



60 సెకన్ల వీడియోను రూపొందించాలని సూచించారు. ఉత్తమంగా నిలిచే ఆలోచనలను ఎంపిక చేసి, జెనీవాలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు పంపే అవకాశం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ అండ్ ట్రేడ్ ఫెయిర్స్‌లో గూగుల్ డెవలపర్ గ్రూప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'డెవ్‌ఫెస్ట్ 2026'లో మంత్రి ప్రసంగించారు. అంకుర సంస్థలు ప్రపంచస్థాయిలో విజయవంతం కావడానికి అవసరమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతున్నందున, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి యువతకు అవసరమైన శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గూగుల్ ఫర్ డెవలపర్స్ ప్రతినిధులు అర్షద్ దేవాని, డెవలపర్స్ రిలేషన్ లీడ్ కార్తిక్ పద్మనాభన్, సలహాదారు సాయికృష్ణ, ఐటీశాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్, కృత్రిమ మేధ హబ్ సీఈవో ఫన్నీ, 3 వేల మందికిపైగా డెవలపర్లు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో తోలు ఉత్పత్తుల పరిశ్రమల బలోపేతం, ఔత్సాహిక ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ఊతమిచ్చేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా ఉమ్మడి సౌకర్యాల కేంద్రం (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలను స్థాపిస్తామన్నారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర తోలు పరిశ్రమల ప్రోత్సాహక సంస్థపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలో తోలు ఉత్పత్తుల పరిశ్రమలను అన్నివిధాలా ప్రోత్సహిస్తాం. గచ్చిబౌలిలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో సీఎఫ్‌సీ ద్వారా డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వరకు చర్మకారులకు మార్గనిర్దేశం చేస్తాం" అని వివరించారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సంచాలకుడు నిఖిల్ చక్రవర్తి, టీజీఎల్ఐపీసీ వీసీ, ఎండీ ప్రశాంత్ కుమార్, రాష్ట్ర తోలుపరిశ్రమల ప్రోత్సాహక సహకార సొసైటీ అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి వనరులకు రక్షణ కల్పించకుంటే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిల ధర్మాసనం విచారించింది. తాగునీటికి వనరులు అత్యంత విలువైనవని, రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు పరిధిలోకి ఇవి వస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది. నీటి వనరుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను 9 ఏళ్ల క్రితమే ప్రచురించినప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదంటూ ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నీటి వనరులను పరిరక్షించుకోకపోవడం వల్ల కలుగుతున్న విపరిణామాలను చూస్తూ తాము మౌనంగా ఉండజాలమంది. నీటి వనరుల భౌతిక ధ్రువీకరణ, సరిహద్దుల గుర్తింపును వెంటనే చేపట్టాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలపై నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే, ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుందని, కనీసం 6 నుంచి 9 నెలల సమయం ఇవ్వాలని సీనియర్ న్యాయవాది శేఖర్ నాఫడే కోరారు. ఈ పనిని పూర్తి చేసేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం కూడా అవసరమని పేర్కొన్న ధర్మాసనం..నాలుగు నెలల గడువు ఇస్తున్నట్లు తెలిపింది.



## అడుగంటిన బోరు మోటార్లు నడిపించొద్దు

### రాజకీయాలకతీతంగా ఎల్‌నినోను ఎదుర్కొందాం

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచన

**ఖమ్మం:** 'రాష్ట్రంలోని సగం అంటే 15 లక్షల పంపుసెట్లల్లో భూగర్భ జలాలు లేవు. నీళ్లులేని బోర్లలో మోటార్లను నడిపించడం ద్వారా లోడ్ పెరిగి మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. అడుగంటిన బోర్లను వినియోగించవద్ద'ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. కూలీలకు ఉపాధి కల్పించడానికి 17.10 లక్షల పనులను గుర్తిస్తున్నామని, ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో రూ.124.75 కోట్లతో చేపట్టనున్న విద్యుత్తు ఉపకేంద్రం బీటీరోడ్లు, రహదారుల విస్తరణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అదే మండలంలోని కొదుమూరులో విలేకరులతో భట్టి మాట్లాడుతూ... "సూపర్ ఎల్‌నినో కారణంగా భవిష్యత్తులో నీటిఎద్దడి ఎదురుకానుంది. వచ్చే ఏడాది జులై రెండో వారం వరకు వర్షాలు పడవు. రాష్ట్రంలోని 44,034 చెరువులు, కుంటల్లో 40% వనరుల్లో పావువంతు కంటే తక్కువగా నీళ్లున్నాయి. పరిస్థితిని గమనించి ప్రజలు విద్యుత్తు, నీటి పొదుపు పాటించాలి. ఉన్న నీటిని కాపాడుకొని మనుషులతోపాటు జీవరాసులన్నింటిని రక్షించడానికి ప్రభుత్వం బాధ్యతాయుతంగా చర్యలు తీసుకుంటోంది. సంక్షోభంలో ప్రజలకు మేలు చేసే సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేయడం విచారకరం. కరోనా సమయం మాదిరిగానే ప్రభుత్వానికి సహకరించాలి" అని కోరారు. "రాష్ట్ర విభజన జరిగినప్పుడు 2014లో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 6,648 మెగావాట్లుంటే ప్రస్తుతం 20,018 మెగావాట్లకు చేరింది. అక్టోబరులో గతం కంటే 25% డిమాండ్ పెరిగింది. సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్తు శాఖ ముందస్తు ప్రణాళికతో సాగుతోంది. ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ పరిధిలో 680 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అనుమతిచ్చాం. అందులో 177 నిర్మించాం. మరో 267 పనులు సాగుతున్నాయి" అని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ దివాకర, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వేగుచుక్క

# భారత్‌కు విజయ 'తిలకం'..

**చివరి ఓవర్లలో అద్భుతం చేసిన తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి**

- రెండో టీ20లోనూ టీమిండియా అద్భుత విజయం
- న్యూజిలాండ్ 20 ఓవర్లలో 180/5 స్కోరు
- గ్లెన్ ఫిలిప్స్ 70, బెవాన్ జాకబ్స్ 58 పరుగులు
- అర్ష్‌దీప్ సింగ్ ఖాతాలో రెండు వికెట్లు
- లక్ష్య ఛేదనలో భారత టాప్ ఆర్డర్ తడబాటు



క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24 :
టీమిండియాకు ఓటమి తప్పదనుకున్న వేళ తెలుగు కుర్రాళ్లు అదరగొట్టారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతం చేశాడు. చివరి ఓవర్లలో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పి న్యూజిలాండ్‌పై టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు మధ్యలో తడబడినా.. తిలక్, నితీశ్ పోరాటంతో విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఆరంభంలో భారత బౌలర్లు పైచేయి సాధించారు. టిమ్ సీఫెర్ట్ (7), డారిల్ మిచెల్ (6), ఫిన్ అలెన్ (16) త్వరగా వెనుదిరిగారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. ప్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. అయితే గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఫిలిప్స్ 43 బంతుల్లో 70 పరుగులు చేయగా, జాకబ్స్ 46 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి న్యూజిలాండ్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ రెండు బంతుల్లోనే 10 పరుగులు చేయడంతో ఆతిథ్య జట్టు 180 పరుగుల స్కోరు సాధించింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా ఔటయ్యారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (7) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో భారత్ పరుగుల కోసం ఇబ్బంది పడింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ చేతుల్లోకి వెళ్లినట్లు కనిపించింది. ఆ సమయంలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి (26 నాటౌట్) బాధ్యత తీసుకున్నారు. తిలక్ (51 నాటౌట్: 6 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించగా, నితీశ్ భారీ షాట్లతో అతడికి అండగా నిలిచాడు. చివరి ఓవర్లలో వీరిద్దరి దూకుడుతో భారత్ విజయానికి చేరువైంది. చివరి ఓవర్‌కు ముందు 10 పరుగులు అవసరమైన దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఆడిన ఈ జోడీ లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 2–0 ఆధిక్యాన్ని అందుకుంది. తొలి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ ఒత్తిడిని తట్టుకుని గెలవడం విశేషం. కీలక సమయంలో తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ చూపిన పోరాటం, నితీశ్ రెడ్డి ఇచ్చిన సహకారం భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి.




# పాకిస్థాన్‌లో మహిళల టీ20 వరల్డ్ కప్..

**దుబాయ్‌లో భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్!**

లాహోర్, అక్టోబర్ 24 :
2028 మహిళల టీ20 వరల్డ్ కప్ నిర్వహణపై ఆసక్తికర అప్‌డేట్ వెలువడింది. ఈ టోర్నమెంట్‌ను పాకిస్థాన్ పూర్తిగా తమ దేశంలోనే నిర్వహించాలని చూస్తుండగా, భారత్ ఆడే మ్యాచ్‌లకు మాత్రం యూఏఈ (దుబాయ్) వేదిక కానుంది. 2028 సెప్టెంబర్ 7 నుంచి అక్టోబర్ 1 వరకు జరగబోయే ఈ టోర్నమెంట్‌కు పాకిస్థాన్ మెయిన్ హోస్ట్‌గా వ్యవహరించనుంది. అయితే భారత్–పాకిస్థాన్ మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగా గతంలో కుదిరిన హైబ్రిడ్ మోడల్ నిబంధనలే వర్తిస్తాయని ఐసీసీ స్పష్టం చేయడంతో.. భారత జట్టు ఆడే మ్యాచ్‌లను దుబాయ్‌కి మార్చాలని పీసీబీ భావిస్తోంది. భారత్ మ్యాచ్‌లు మినహా గ్రూప్ దశలోని మిగతా మ్యాచ్‌లు, నాకౌట్ మ్యాచ్‌లన్నింటినీ పాకిస్థానే నిర్వహించనుంది. ఒకవేళ ఫైనల్ చేరే జట్లలో భారత్ లేకపోతే లాహోర్‌లోనే ఫైనల్ నిర్వహించాలని యోచిస్తున్నారు. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో 2025 చాంపియన్స్ ట్రోఫీ, 2023 ఆసియా కప్ వంటి టోర్నీల్లోనూ ఇదే హైబ్రిడ్ ఫార్ములాను అమలు చేసిన విషయం తెలిసిందే.

# ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో పీవీ సింధు

- మరో సూపర్ 750 టైటిల్‌పై కన్ను
- మూడు గేమ్‌ల పోరులో జపాన్ షట్లర్‌పై విజయం
- 38 షాట్ల ర్యాలీతో మ్యాచ్‌లో కీలక మలుపు
- ఫైనల్లో అన్ సే-యంగ్‌తో టైటిల్ పోరు

## రెండో గేమ్ కోల్పోయినా పుంజుకున్న భారత స్టార్




పారిస్, అక్టోబర్ 24 :
భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం (అక్టోబర్ 24) జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 22వ ర్యాంకర్, జపాన్ క్రీడాకారిణి హీనా అకేచిపై సింధు అద్భుత విజయం సాధించారు. గంటా 13 నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో 21-10, 20-22, 21-16 తేడాతో విజయం సాధించి, ఈ ఏడాది తన రెండో సూపర్ 750 ఫైనల్‌లో అడుగుపెట్టారు. గత జులైలో జపాన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధుకు ఇది ఈ ఏడాది మరో పెద్ద విజయం.

**తొలి గేమ్‌లో సింధు ఏకపక్ష ఆధిపత్యం**

తొలి గేమ్ ప్రారంభంలో ఇరు క్రీడాకారిణులు హోరాహోరీగా తలపడటంతో స్కోరు 4-4, 8-8తో సవ-ంమైంది. ఆ తర్వాత లయ అందుకని 11-9 ఆధిక్యంతో విరామానికి వెళ్లిన భారత స్టార్, ఆ తర్వాత ఊహించని రీతిలో చెలరేగిపోయారు. కేవలం 18 నిమిషాల్లోనే వం-సగా 12 పాయింట్లలో 11 పాయింట్లు ఖాతాలో వేసుకుని 21-10 తేడాతో తొలి గేమ్‌ను సునాయసంగా కైవసం చేసుకున్నారు.

**రెండో గేమ్‌లో జపాన్ క్రీడాకారిణి బలమైన కంబాక్**

రెండో గేమ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధుకు గట్టి పోటీ ఎదురైంది. మొదట్లో నాలుగు పాయింట్లు వెనుకబడినప్పటికీ, సింధు తిరిగి పుంజుకుని స్కోరును 7-7తో సమం చేశారు. తన పవర్ ఫుల్ షాట్లు, క్రాస్ కోర్ట్ దాడులతో స్కోరును 14-14, 16-16తో రసవత్తరంగా మార్చారు. అయితే, ఆఖరి నిమిషాల్లో జపాన్ షట్లర్ తీవ్రంగా పోరాడి గేమ్ పాయింట్ సాధించింది. మొదటి గేమ్ పాయింట్‌ను సింధు కాపాడుకున్నప్పటికీ, ఆ తర్వాత చేసిన చిన్న పొరపాటుతో రెండో గేమ్‌ను 20-22తో అకేచి కైవసం చేసుకుంది.

**నిర్ణయాత్మక మూడో గేమ్.. 38 షాట్ల ర్యాలీతో మ్యాచ్ తిరిగిన మలుపు**

ఫైనల్ బెర్తును తేల్చే మూడో గేమ్ తీవ్ర ఉత్కంఠ నడుమ సాగింది. 5-3 ఆధిక్యంతో నిలిచిన సింధును జపాన్ క్రీడాకారిణి నెట్ ప్లేతో గట్టి సవాల్ విసిరి స్కోరును 15-15తో సమం చేసింది. అయితే, మ్యాచ్‌కు అసలైన మలుపు తిరిగింది 18-16 వద్ద జరిగిన సుదీర్ఘమైన 38 షాట్ల ర్యాలీతోనే! అకేచి చేసిన నెట్ ఎర్రర్ వల్ల ఈ పాయింట్ సింధు ఖాతాలో పడింది. అదే ఉత్సాహంతో సింధు వరుస పాయింట్లు సాధించి 4 మ్యాచ్ పాయింట్లు సాధించారు. ఆఖరిగా పవర్ ఫుల్ క్రాస్ కోర్ట్ స్మాష్‌తో గేమ్‌ను 21-16తో ముగించి ఫైనల్ పిలుపు అందుకున్నారు.

**ఫైనల్లో ప్రపంచ నంబర్ 1 అన్ సే-యంగ్ తో పోరు..**

ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో ప్రపంచ నంబర్ వన్, దక్షిణ కొరియా స్టార్ షట్లర్ అన్ సే-యంగ్‌తో సింధు తలపడనున్నారు. ఫైనల్ మ్యాచ్‌పై సింధు స్పందిస్తూ.. "ఫైనల్‌కు చేరుకోవడం సంతోషంగానే ఉంది, కానీ పని ఇంకా పూర్తి కాలేదు. ఫైనల్‌పై దృష్టి సారించాల్సి ఉంది. ఆమె ప్రస్తుతం అత్యుత్తమ ఫామ్‌లో ఉంది. గతంలో మేము చాలాసార్లు తలపడ్డాం. రేపు సరికొత్త రోజు, ప్రతి పాయింట్ ముఖ్యం. మైదానంలో నా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తూ ఆమెకు గట్టి పోటీ ఇస్తాను" అని స్పష్టం చేశారు. గాయాలు, ఫామ్ లేమితో ఇబ్బంది పడిన సమయం నుంచి కోలుకోవడానికి కొత్త సపోర్ట్ టీమ్, శిక్షణ పద్ధతుల్లో చేసిన మార్పులు ఎంతగానో ఉపయోగపడ్డాయని సింధు ఈ సందర్భంగా వెల్లడించారు.




# అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త రికార్డ్..

**భువనేశ్వర్‌ను అధిగమించిన యువ పేసర్!**

**ఒకే ఏడాదిలో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అర్ష్‌దీప్**

**భువనేశ్వర్ కుమార్ 37 వికెట్ల రికార్డును అధిగమించిన పంజాబ్ పేసర్**

**2026లో ఇప్పటివరకు 38 వికెట్లు పడగొట్టిన అర్ష్‌దీప్ సింగ్**

**న్యూజిలాండ్‌తో రెండో టీ20లో ఈ అరుదైన ఘనత సాధన**

క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:
భారత యువ ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పేరిట ఉన్న రికార్డును అతను అధిగమించాడు. న్యూజిలాండ్‌తో శనివారం హేగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ 33 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు తీశాడు. దీంతో 2026 క్యాలెండర్ సంవత్సరంలో అతని వికెట్ల సంఖ్య 38కి చేరింది. ఇంతకుముందు ఈ రికార్డు భువనేశ్వర్ కుమార్ పేరిట ఉండేది. భువనేశ్వర్ 2022 సీజన్ లో 37 వికెట్లు తీశాడు. విశేషమేమిటంటే, భువీ 31 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా, అర్ష్‌దీప్ కేవలం 26 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును దాటడం అతని నిలకడకు నిదర్శనం. ఈ మ్యాచ్‌లో తొలుత టిమ్ సీఫర్ట్‌ను ఔట్ చేసి న్యూజిలాండ్‌కు తొలి దెబ్బతీసిన అర్ష్‌దీప్, ఆ తర్వాత ప్రమాదకరంగా మారుతున్న గ్లెన్ ఫిలిప్స్ (70) వికెట్‌ను కూడా పడగొట్టి రికార్డును సొంతం చేసుకున్నాడు. ఒక దశలో 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కివీస్‌ను, గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ (58) నాలుగో వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 180 పరుగులు చేయగలిగింది. ఈ ప్రదర్శనతో, ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన ప్రపంచ బౌలర్ల జాబితాలో అర్ష్‌దీప్ మూడో స్థానానికి చేరాడు. ఐర్లాండ్‌కు చెందిన జాష్ లిటిల్ (39 వికెట్లు, 2022), శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ (38 వికెట్లు, 2024) అతని కంటే ముందున్నారు.

# 'కాంతార' బ్యూటీ ఎమోషనల్ పోస్ట్!

హైదరాబాద్, అక్టోబర్ 24 : కన్నడ యువ నటి రుక్మిణి వసంత్ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా 'కాంతార: చాప్టర్ 1'లో అవకాశం దక్కించుకున్న తర్వాత దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఆమెకు క్రేజ్ విపరీతంగా పెరిగింది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె ఒక కొత్త చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'ఒకే ఒక జీవితం' ఫేమ్ శ్రీ కార్తీక్ ఈ చిత్రంలో నటిస్తూ దర్శకత్వం వహిస్తుండగా, ఈ సినిమాకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి రుక్మిణి వసంత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్‌ను పంచుకున్నారు. "తొలిసారి కథ విన్నప్పటి నుంచే ఈ సినిమాపై మా బృందంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. సెట్‌లోకి అడుగుపెట్టే ప్రతి క్షణం ఎంతో ఉత్కంఠగా అనిపించింది. ఈ సానుకూల వాతావరణం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని ఆమె పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఆమె 'తార' అనే ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుణి సినీ కార్పొరేషన్స్ సంయుక్త నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పవర్‌ఫుల్ టైటిల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు.



# ఆర్థిక రంగంపై పార్లమెంటరీ నజర్

- క్రిప్టో, ఏఐ సహా 46 అంశాలపై అధ్యయనం
- 2026–27 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ
- బ్యాంకింగ్, బీమా, కరెన్సీ నిర్వహణపై సమీక్ష
- జీఎస్టీ, ప్రత్యక్ష పన్నుల సంస్కరణలపైనా దృష్టి
- కమిటీ ఛైర్మన్‌గా భర్తృహరి మహతాబ్

**న్యూఢిల్లీ:**

దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సమగ్ర అధ్యయనం చేపట్టనుంది. క్రిప్టో ఆస్తులు, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, బ్యాంకింగ్, బీమా, కరెన్సీ నిర్వహణ, పన్నుల సంస్కరణలు సహా మొత్తం 46 అంశాలను 2026-27 ఆర్థిక సంవత్సరంలో పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ మేరకు అధ్యయనాలు నిర్వహించి నివేదికలు రూపొందించ



నున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలో పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్వ్యవస్థీకరించారు. ఇందులో భాగంగా ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను మరోసారి నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాలు, వ్యయం, రెవెన్యూ, ఆర్థిక సేవలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలించనుంది.

**క్రిప్టో, ఏఐపై ప్రత్యేక దృష్టి**

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న నేపథ్యంలో వర్చువల్ డిజిటల్ ఆస్తుల ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు విధానాలపై కమిటీ అధ్యయనం చేయనుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవల్లో ఏఐ వినియోగంతో కలిగే ప్రయోజనాలు, సవాళ్లను విశ్లేషించనుంది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నియంత్రణలో ఉన్న లోపాలు, ఆర్థిక రంగంలో పర్యవేక్షణ, పారదర్శకత పెంపునకు అవసరమైన చర్యలను పరిశీలించనుంది.

**కరెన్సీ, ధరల స్థిరత్వంపై సమీక్ష**

ధరల స్థిరత్వం, రూపాయి విలువ, కరెన్సీ నిర్వహణకు సంబంధించిన విధానాలను కమిటీ సమీక్షించనుంది. మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పాత్రను పరిశీలించనుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ, బ్యాంకింగ్, పెన్షన్, ఆరోగ్య బీమా రంగాల పనితీరును అధ్యయనం చేయనుంది. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును కూడా సమీక్షించనుంది.

**పన్నుల సంస్కరణలపైనా దృష్టి**

కస్టమ్స్ సుంకాలు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ), ప్రత్యక్ష పన్నుల వ్యవస్థల్లో చేపట్టాల్సిన మార్పులను కమిటీ పరిశీలించనుంది. పన్నుల విధానాలు ప్రభుత్వ ఆదాయం, ఆర్థిక కార్యకలాపాలపై చూపుతున్న ప్రభావాన్ని విశ్లేషించనుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పనితీరు, ఆర్థిక మార్కెట్ల నియంత్రణ, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించనుంది.

**కంపెనీల పాలన, గణాంకాలపై అధ్యయనం**

జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఎదుర్కొంటున్న సమస్యలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), కంపెనీల ఈగవర్నెన్స్, ఆడిటర్ల జవాబుదారీతనాన్ని కమిటీ పరిశీలించనుంది. అలాగే నీతి ఆయోగ్ అభివృద్ధి ప్రణాళికలు, ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం పనితీరును సమీక్షించనుంది. జాతీయ ఖాతాల గణాంకాల సేకరణ, విశ్లేషణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు అవసరమైన మార్గాలను అధ్యయనం చేసి, ఆర్థిక రంగంలో విధానపరమైన సంస్కరణలకు సిఫారసులు చేయనుంది.

# సోనియా గాంధీ ప్రేమకథ.. కేంబ్రిడ్జ్‌లో తొలి పరిచయం





- రాజీవ్ గాంధీతో తొలి భేటీని గుర్తుచేసుకున్న సోనియా
- గ్రీక్ రెస్టారెంట్‌లో మొదలైన ప్రేమ ప్రయాణం
- 'బిలాంగింగ్ – ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం నుంచి వీడియో
- నవంబర్ 10న పుస్తక ఆవిష్కరణ

**ఢిల్లీ**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జీవిత భాగస్వామి, దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ఏర్పడిన తొలి పరిచయం, ఆ తర్వాత వారి మధ్య చిగురించిన ప్రేమానుబంధాన్ని తాజాగా పంచుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. ఇప్పుడు ఎక్స్ వేదికగానూ తన జ్ఞాపకాలను వెల్లడించారు. తాను రచించిన 'బిలాంగింగ్ - ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకానికి సంబంధించిన వీడియోను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ పుస్తకం నవంబర్ 10న పాఠకుల ముందుకు రానుంది.

దాదాపు రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియోలో కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీని తొలిసారి కలిసిన సందర్భాన్ని సోనియా గుర్తుచేసుకున్నారు. అప్పట్లో మంచి ఆహారం దొరికే రెస్టారెంట్ల కోసం వెతికేవారని, ఇటాలియన్ వంటకాలు తినాలనే ఆసక్తితో అన్వేషించేవారని తెలిపారు. అలా వర్సిటీ రెస్టారెంట్‌కు వెళ్లిన సమయంలోనే రాజీవ్‌తో పరిచయం ఏర్పడిందని వివరించారు. వారిద్దరూ తొలిసారి కలుసుకున్న రెస్టారెంట్ చిత్రాలను కూడా వీడియోలో చూపించారు. తొలి పరిచయంతోనే రాజీవ్ తనను ఆకర్షించారని సోనియా వెల్లడించారు. ఆయనతోనే జీవితాన్ని పంచుకోవాలనే భావన మొదటి సమావేశంలోనే కలిగిందని తెలిపారు. రాజీవ్‌కు కూడా తనపై అలాంటి అభిప్రాయమే ఏర్పడిందని పేర్కొన్నారు. ఉమ్మడి స్నేహితుడి ద్వారా పరిచయమైన తామిద్దరం.. ఆ తర్వాత స్నేహితులుగా మారామని చెప్పారు. పార్టీలకు వెళ్లడం, స్నేహితులతో కలిసి సమయం గడపడం, వాలెంటైన్స్ డే వేడుకల్లో పాల్గొనడం వంటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

రాజీవ్ గాంధీ వ్యక్తిత్వం ఎంతో ఆకర్షణీయంగా ఉండేదని, ఆయనలోని సౌమ్యత, సరళత తనను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని సోనియా తెలిపారు. ప్రేమ, నవ్వులు, అనుభూతులతో నిండిన ప్రపంచాన్ని తామిద్దరం నిర్మించుకున్నామని పేర్కొన్నారు. ఆ జ్ఞాపకాలనే 'బిలాంగింగ్ - ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ద్వారా పాఠకులతో పంచుకోనున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

# "ఢిల్లీలో ఉంటున్నట్లు ఆధారాలేవి?"

- శాంతి బాండ్ ప్రక్రియలో సౌరవ్ దాస్‌కు కోర్టు ఆదేశం
- అద్దె, లీజు పత్రాలు సమర్పించకపోవడంపై అభ్యంతరం
- నవంబర్ 17కు తదుపరి విచారణ వాయిదా
- నేహా బోరా పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**ఢిల్లీ:**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కోకన్వీనర్ సౌరవ్ దాస్ ఢిల్లీలో నివసిస్తున్నట్లు ధ్రువీకరించే పత్రాలను సమర్పించాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు ఆదేశించింది. శాంతి బాండ్ దాఖలు ప్రక్రియలో భాగంగా శనివారం జరిగిన విచారణ సందర్భంగా ఆయన నివాసానికి సంబంధించిన ఆధారాలను కోర్టు కోరింది. అయితే, అద్దె ఒప్పందం, ఆస్తి పత్రాలు లేదా లీజు డాక్యుమెంట్లను సమర్పించకపోవడాన్ని గుర్తించింది. పత్రాల పరిశీలన కోసం తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు ఇటీవల షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. అక్టోబర్ 10న శాంతి బాండ్‌పై సంతకాలు చేసిన వీరిద్దరూ, ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో అక్టోబర్ 13న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ఏడు రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. శనివారం వీరిద్దరూ తమ పూచీకత్తుదారులతో కలిసి కోర్టుకు హాజరయ్యారు. మరోవైపు, ఇదే నిరసనలకు సంబంధించిన









కేసులో నిందితురాలిగా ఉన్న అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించలేదు. శాంతి బాండ్‌పై సంతకం చేయాలంటూ ఎస్ఈఎం కోర్టు జారీ చేసిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో తాను శాంతి బాండ్‌ను సమర్పించబోనని నేహా బోరా స్పష్టం చేశారు. నిరసనలను అణచివేసేందుకు శాంతి బాండ్లను సాధనంగా ఉపయోగిస్తున్నారని ఆమె ఆరోపించారు.

# ఆర్టికల్ 370 కోసం పోరాటం ఉధృతం

- జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని డిమాండ్
- కేంద్రం హామీలు నెరవేర్చలేదన్న ఫరూఖ్ అబ్దుల్లా
- హక్కులు, ప్రత్యేక గుర్తింపు కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపు
- తమ దేశభక్తిని ప్రశ్నించడం సరికాదని వ్యాఖ్య

**బారాముల్లా:**

ఆర్టికల్ 370 పునరుద్ధరణ, జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా తిరిగి కల్పించాలనే డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలు తమ హక్కులు, ప్రత్యేక గుర్తింపును కాపాడుకునేందుకు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

శనివారం బారాముల్లాలోని డాక్ బంగ్లాలో





పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హక్కుల కోసం పోరాడే విషయంలో వెనుకడుగు వేయకూడదని సూచించారు. ధైర్యంగా పోరాడితేనే లక్ష్యాన్ని చేరుకోగలమని, ఐక్యతతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చని అన్నారు.

**బీజేపీపై విమర్శలు**

జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక గుర్తింపును బీజేపీ, కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తున్నాయని ఫరూఖ్ అబ్దుల్లా ఆరోపించారు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం డిమాండ్ చేయడాన్ని దేశవ్యతిరేక చర్యగా పరిగణించడం సరికాదన్నారు. గాంధీ, నెహ్రూల భారతదేశానికి తాము చెందినవారమని పేర్కొంటూ, తమ దేశభక్తిని ఎందుకు ప్రశ్నిస్తున్నారని ఆయన నిలదీశారు. ప్రజల హక్కులు, రాజకీయ డిమాండ్లను దేశవ్యతిరేకతతో ముడిపెట్టవద్దని అన్నారు.

# శాంతి బాండ్‌పై సంతకానికి నేహా బోరా నిరాకరణ

- నిరసన హక్కును అణచివేసేందుకే పోలీసుల చర్యలని ఆరోపణ
- రూ.10 వేల వ్యక్తిగత బాండ్, పూచీకత్తు సమర్పించాలని నోటీసు
- పోలీసులపై లాఠీఛార్జ్, మహిళల దుస్తులు చించారంటూ విమర్శలు
- బాండ్లను సాధారణ అంశంగా మార్చేందుకు అంగీకరించబోమని స్పష్టీకరణ

**ఢిల్లీ, అక్టోబర్ 24:**

ప్రజాస్వామ్య నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు జారీ చేస్తున్న శాంతి బాండ్లపై సంతకం చేసేది లేదని అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా స్పష్టం చేశారు. నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును దెబ్బతీసేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. "ఈ బాండ్‌పై సంతకం చేసి నేను ఎవరి శాంతిని కాపాడాలి?" అని ప్రశ్నించారు. శనివారం ఢిల్లీలోని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్లమెంటరీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను ప్రశ్నించే హక్కు తదితర అంశాలపై అక్టోబర్ 16న మండీ హౌస్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న సమయంలో తనను అదుపులోకి తీసుకున్నారని నేహా తెలిపారు. అనంతరం భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 126 కింద అక్టోబర్ 17న ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోనని హామీ ఇస్తూ రూ.10 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒకరి పూచీకత్తు సమర్పించాలని అందులో పేర్కొన్నట్లు వివరించారు. నిరసన సందర్భంగా తాము శాంతికి విఘాతం కలిగించలేదని, పోలీసులే లాఠీఛార్జ్‌కు దిగారని నేహా ఆరోపించారు. మహిళల దుస్తులు చించడంతో పాటు జర్నలిస్టులపైనా దాడులు చేశారని విమర్శించారు. శాంతి పేరుతో ప్రజల హక్కులను పరిమితం చేయడం సరికాదని పేర్కొంటూ, "శాంతి అనేది ప్రభుత్వానికే కాదు.. ప్రజలకు కూడా ఉండాలి" అని వ్యాఖ్యానించారు.

పోలీసుల నోటీసులను సవాల్ చేస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసినప్పటికీ, కేసులోని అంశాలపై లోతైన పరిశీలన జరగలేదని నేహా చెప్పారు. విచారణకు హాజరుకావాలని మాత్రమే కోర్టు సూచించిందని,





షోకాజ్ నోటీసు జారీ చేసి బాండ్‌పై సంతకం చేయాలని బలవంతం చేయలేరని వాదించారు. ప్రజాస్వామ్య నిరసనలను నియంత్రించే సాధనాలుగా ఇలాంటి బాండ్లను ఉపయోగించడాన్ని తమ సంఘం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రజల్లోకి బలంగా వెళ్లాలి

- తొమ్మిది జిల్లాల అధ్యక్షులు, పదాధికారులకు రామచందర్‌రావు పిలుపు

**హైదరాబాద్, అక్టోబర్ 24 :**

బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను సమాయత్తం చేసి ప్రజల్లోకి బలంగా వెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తన అధ్యక్షతన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని తొమ్మిది జిల్లాల ముఖ్య నాయకులు, రాష్ట్ర పదాధికారుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. అలాగే ప్రజాస్వామ్యాన్ని అణచివేసే చర్యలకు వ్యతిరేకంగా చేపట్టిన 'లోక్‌తంత్ర బచావో -



భీడ్‌తంత్ర హటావో' ఉద్యమంపై సమావేశంలో చర్చించారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పోకడలను తిప్పికొడుతూ క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జిలు అభయ్ పాటిల్, రేఖా శర్మ, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి ఎన్.మధుకర్ జీ, పార్టీ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా (సహ సంఘటన ప్రధాన కార్యదర్శి), పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# దీపావళి వేళ ర్యాలీ వద్దు

- రూ.10 వేల కోట్ల వ్యాపార నష్టం జరిగే ప్రమాదం
- నవంబర్ 10 తర్వాత నిర్వహించాలని సీటీఐ విజ్ఞప్తి
- రాహుల్ గాంధీకి లేఖ రాసిన ఛైర్మన్ బ్రిజేష్ గోయల్
- ర్యాలీతో మార్కెట్లలో ట్రాఫిక్ ఇబ్బందులపై ఆందోళన

**ఢిల్లీ, అక్టోబర్ 24:**

దీపావళి పండగ నేపథ్యంలో ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా నవంబర్ 1న తలపెట్టిన 'ఇండియా' కూటమి ర్యాలీని వాయిదా వేయాలని వ్యాపార సంఘాలు కోరాయి. ఈ ర్యాలీ వల్ల సుమారు రూ.10,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ లేఖ రాశారు.

నవంబర్ 6న ధంతేరస్, 8న దీపావళి ఉండటంతో కొనుగోళ్ల కోసం వినియోగదారులు పెద్ద సంఖ్యలో మార్కెట్లకు చేరుకుంటారని బ్రిజేష్ గోయల్ పేర్కొన్నారు. ఈ సమయంలో ర్యాలీ నిర్వహిస్తే రవాణా, వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పండగ సీజన్ ముగిసిన తర్వాత నవంబర్ 10 నుంచి ర్యాలీ నిర్వహించాలని సూచించారు. దీపావళి సందర్భంగా ఢిల్లీలో బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, గృహోపకరణాలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, వాహనాలు, స్థిరాస్తి, బహుమతుల విక్రయాలు సహా వివిధ రంగాల్లో సుమారు రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుందని సీటీఐ అంచనా వేసింది. రామ్‌లీలా మైదానానికి ఐదు కిలోమీటర్ల పరిధిలో చాందినీ చౌక్, సదర్ బజార్ సహా దాదాపు 20 హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయి. ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తే ఈ ప్రాంతాల్లో వ్యాపారానికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని వ్యాపారులు పేర్కొన్నారు. గత అక్టోబర్‌లో సెంట్రల్ ఢిల్లీలో జరిగిన పలు ర్యాలీలు, రహదారుల మూసివేత కారణంగా ఇప్పటికే రూ.3,000 కోట్ల వరకు నష్టపోయామని వ్యాపార వర్గాలు గుర్తుచేశాయి. ఓటర్ల జాబితా సవరణలో 'ఓట్ల చోరీ' జరిగిందన్న ఆరోపణలతో పాటు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో 'ఇండియా' కూటమి ఈ ర్యాలీకి పిలుపునిచ్చింది. శాంతియుత నిరసనలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేసిన సీటీఐ, పండగ సీజన్ పూర్తయ్యే వరకు వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది.

